క్లుప్తంగా

ఆశ వర్కర్లు సేవాభావంతో పనిచేయాలి



ఆశ వర్కర్లకు దుప్పట్లు అందజేస్తున్న వైద్యాధికారి సంతోష్

గణపవరం: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ఆశ వర్కర్లది గురుతర బాధ్యత అని, ఆశ వర్కర్లు సేవాభావంతో పనిచేయాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. మంగళవారం ఆశ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో ఆశ వర్కర్లను సత్కరించారు. ఈసందర్భంగా ఆశ వర్కర్లకు ఒక్కొక్కరికీ రెండేసి దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రసంగించిన పలువురు ఆశ వర్కర్ల సేవలను అభినందించారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలది విల్సన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

11న విశ్వరూప సభ

పెదపాడు: ఈనెల 11న హైదరాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేమురోళి కృష్ణ మాదిగ పిలుపు మేరకు పెదపాడు మండలంలోని ఏపూరులో కరపత్రాలు ఆవిష్కరించారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ మాదిగల భవిష్యత్తు అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నిమ్మకూరి కిరణ్‌కుమార్, లక్కపాము శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ



కొవ్వలి ఉన్నత పాఠశాలలో మొక్కలు అందజేస్తున్న దృశ్యం

దెందులూరు: పిరమిడ్ స్పిరిట్యువల్ స్థాపకుడు సుభాష్ పత్రీజీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కొవ్వలి ఉన్నత పాఠశాలలో మంగళవారం మొక్కలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం శర్మకు సొసైటీ ప్రతినిధులు 615 మంది విద్యార్థులకు మొక్కలు అందజేశారు.

భవిత సెంటర్‌కు పాలు పంపిణీ



భవిత సెంటర్‌కు పాలు పంపిణీని ప్రారంభించిన ఎంఈవో కె.శ్రీనివాసరావు

ఉంగుటూరు: ఉంగుటూరు భవిత కేంద్రంలో దివ్యాంగులకు పాలు పంపిణీ కార్యక్రమాన్ని ఎంఈవోలు రవీంద్రభారతి, కె. శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ పాలును సీఆర్పీ ఉప్పిలి నాగేంద్ర ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి రోజు పాలుకు అయ్యే వ్యయాన్ని నాగేంద్ర విరాళంగా అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంఈవో- 1 నిమ్మగడ్డ రవీంద్రభారతి చేతులు మీదుగా పంపిణీ చేశారు. దివ్యాంగులకు ఉచిత పాలు పంపిణీ చేసినందుకు దాత నాగేంద్రను పలువురు అభినందించారు.

సీవీ రామన్‌కు ఘన నివాళి



కొవ్వలి ఉన్నత పాఠశాలలో సర్ సీవీ రామన్ జయంతి వేడుక

దెందులూరు: సర్ సీవీ రామన్ స్ఫూర్తితో విద్యార్థులు విద్యనభ్యసించాలని కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శర్మ అన్నారు. మంగళవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో సర్ సీవీ రామన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొబ్బరి, ఆయిల్ పామ్‌కు గిట్టుబాటు ధర కల్పించాలి

పెదవేగి : కొబ్బరి, ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధరలు రాకపోవడానికి కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వ విధానాలే కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. అసమానతలు లేని రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం సీపీఎం చేపట్టిన రాష్ట్ర బస్సు యాత్ర మంగళవారం సాయంత్రం విజయరాయి చేరుకుంది. ఈ బస్సు యాత్రకు కొబ్బరి,ఆయిల్ పామ్ రైతులు, ఉపాధి హామీ కూలీలు ఘన స్వాగతం పలికారు. రైతుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షుడు బొల్లి రామకృష్ణ, గుడిబండి రమేష్ రెడ్డి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై ఎ.అప్పలస్వామి,జి.దానమ్మ వినతి పత్రాలు అందజేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఎం రాష్ట్ర నాయకులు కె.సురేంద్ర, దడాల సుబ్బారావు, మద్రాపు సూర్యనారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పాల్గొన్నారు.

రైతు బాంధవుడు సీఎం వైఎస్ జగన్

దెందులూరు: రైతును రాజుగా చేయాలన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆశయాలను నూరు శాతం అమలుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర ఉన్నంత కాలం ప్రతి ఒక్కరి హృదయాల్లో నిలిచి ఉంటారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి బటన్ నొక్కి, నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఏలూరు జిల్లాలో 2,04,327 మంది రైతులకు 5వ విడత రెండో దశలో ప్రతి ఒక్కరికీ రూ. 4 వేలు పంట సాగుకు అవసరమైన ఆర్థిక చేయూత లభించిందన్నారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక చేయూత లభించిన ఏలూరు జిల్లా రైతులందరి తరఫున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంపీ శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.



చెస్ క్రీడాకారులను అభినందిస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

అంతర్జాతీయ చెస్ విద్యార్థులకు ఎంపీ అభినందన

దెందులూరు: ఏకాగ్రత, నిరంతర సాధన, క్రమశిక్షణతో కృషి చేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మంగళవారం ఎంపీ కార్యాలయంలో ఏలూరు అమలోద్భవి పాఠశాలలో విద్యార్థులు ఇటీవల భీమవరంలో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిడే రేటింగ్ అండర్-10లో విభాగంలో అభిషేక్ అరహాస్ విజయం సాధించారు. అండర్-7 విభాగంలో జీ. అనురూప్ విజయం సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించేందుకు కారకులైన కోచ్ యోహానును, విద్యార్థులను ఎంపీ కోటగిరి శ్రీధర్ అభినందించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎం. సూర్యనారాయణ, చంటి ప్రియ విజేతలను అభినందించారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత



కాగుపాడు సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణరావు

ఉంగుటూరు: దోమల నియంత్రణ అందరి బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం కాగుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా వర్కర్లు సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికార్లు డా.పి మానస, డా.వర్మ, డా.శ్రావణ, డా. శిరీష పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మణరావు దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఆరోగ్య కార్యదర్శులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గడపగడపకూ సేవలందించాం

- వేగివాడలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పల్లెనిద్ర
- ఆర్‌బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభం

పెదవేగి : ప్రతి గడపగడపకూ సేవలందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ అన్నారు. పల్లె నిద్ర అనంతరం పెదవేగి మండలం వేగివాడ సచివాలయ పరిధిలోని ప్రతి గడపకు ఎమ్మెల్యే కొఠారు వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ప్రతి ఒక్కరినీ అడిగి తెలుసుకున్నారు. ఇంకా అర్హులుంటే గుర్తించి వారికి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు, వలంటీర్లకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రజలంతా ఆదరించి ఘన విజయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సొసైటీ అధ్యక్షులు, పార్టీ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, సభ్యులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కె కన్నాపురంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ప్రభుత్వ భవనాల ప్రారంభం

పెదవేగి మండలం వేగివాడలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ప్రారంభించారు. వైఎస్సార్ రైతు భరోసాలో భాగంగా వరుసగా ఐదో ఏడాది రెండో విడతలో భాగంగా దెందులూరు నియోజకవర్గంలో అర్హులైన లబ్ధిదారులకు రూ.84,58,31,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. కే. కన్నాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలి

గణపవరం: విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చునని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ డా.నిర్మల కుమారి అన్నారు. మంగళవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకొని సాధించుకునేందుకు కష్టపడి చదవాలని సూచించారు. కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి కాకర్ల శ్రీను మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, ఎన్నో పథకాలను అమలు చేస్తోందని, వీటిని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు ఆవంతి సత్తిబాబు, సీహెచ్ సత్యనారాయణరాజు, నడిపల్లి శ్రీరామ్, కాకర్ల రాము పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణకు ఆవంతి సత్తిబాబు ఆర్థిక సహకారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. జానపద నృత్యాలు, ఏకపాత్రాభినయం ప్రదర్శించారు. ఇటీవల ఆస్కార్ అవార్డు పొందిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటునాటు పాటకు విద్యార్థులు వేసిన స్టెప్స్ అందరినీ ఆకట్టుకున్నాయి.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నిర్మలకుమారి

రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతమే లక్ష్యం

భీమడోలు: రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని భీమడోలు ఏపీఎం పి.సురేష్‌కుమార్ అన్నారు. భీమడోలు మండల సమైఖ్య కార్యాలయంలో ఆగడాలలంక ఏరియాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు శిక్షణ తరగతులు రెండవ రోజైన మంగళవారం కొనసాగాయి. ఉత్పత్తిదారుల సంఘాల బాధ్యతలు, విధులు, ఆర్థికపరమైన విషయాలు, బీమా, మార్కెటింగ్, గిడ్డంకులు, సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, ప్రోత్సాహకాలు, రాయితీలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏపీఎం పి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. ఈ శిక్షణలో మెలకువలను పాటించి అందులకు తగిన విధంగా మార్కెటింగ్ చేసుకుంటే ఆర్థిక స్వావలంబన సాధిస్తారన్నారు. మండలంలోని 80 సంఘాల మహిళ రైతులు శిక్షణలోని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో సీసీలు సీతారామయ్య, గ్లోరి, ఉత్పత్తిదారుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



భీమడోలులో శిక్షణ పొందుతున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు

మన వాడ- మన పంచాయతీ సమావేశం

పెదపాడు: ఎయిమ్స్ అంబేద్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకుడు పీవీ సునీల్ కుమార్ ఆదేశాల మేరకు గుడిపాడులో ఏలూరు జిల్లా అధ్యక్షుడు వాసే ఆనంద్ అధ్యక్షతన మంగళవారం మన వాడ- మన పంచాయతీ సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ దళివాడల అభివృద్ధికి పలు తీర్మానాలు చేసారు. దళిత వాడలు ప్రత్యేక పంచాయతీలుగా మారాలని అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బంటుమిల్లి భాను, కాకి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి చరమ గీతం పాడాలి

ఏలూరు (టూటౌన్): దేశంలో మతోన్మాద బీజేపీకి చరమ గీతం పాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం సాయంత్రం ఏలూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కండ్రిగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి అశోక్ నగర్ బ్రిడ్జి, రైతుబజార్, విజయ్ విహార్ సెంటర్ మీదుగా ఆర్‌ఆర్‌పేట పార్కు వద్దకు సీపీఎం కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్కు వద్ద సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన బహిరంగ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీకి వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు పలకటం బాధాకరమన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ తదితర ధరలను బీజేపీ పెంచిందని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిందని దుయ్యబట్టారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, వి.ఉమామహేశ్వరరావు తదితర నాయకులు మాట్లాడారు. సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర, జిల్లా కార్యదర్శి ఎ.రవి, పార్టీ సీనియర్ నాయకులు బి.సోమయ్య, జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



ఏలూరు సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో నూతన విధానానికి నాంది పలికారు. ఏలూరు నగరంలో 7వ డివిజన్ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. 350 మంది వరకు స్థానిక ప్రజలు వైద్య సేవలు పొందినట్టు అధికారులు తెలిపారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, స్థానిక పార్టీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మెడికల్ క్యాంపులో వైద్యపరీక్షల నిర్వహణపై ఆరా తీశారు. బీపీ టెస్ట్ చేయించుకున్నారు. ప్రజారోగ్యంపై సీఎం జగనన్నకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనంగానే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రామ్ రూపొందించారని శ్రీలక్ష్మి తెలిపారు. పేద ప్రజలు ప్రతి నెలా బీపీ, షుగర్, థైరాయిడ్, ఇతర వ్యాధులకు వేలాది రూపాయాలు ఖర్చుచేస్తూ ఉంటారని, ఈ సొమ్ము ఆయా కుటుంబాలకు భారంగా ఉంటుందనే ఆలోచనతో సీఎం జగనన్న నూతన విధానానికి శ్రీకారం చుట్టారని వివరించారు. ప్రజలు ఈ వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని కోరారు. టీడీపీ హయాంలో ప్రజారోగ్యం గురించి పట్టించుకున్న దాఖలాలు లేవని ఆరోపించారు. రాబోయే కాలంలో మరింత సంక్షేమం కోసం జగనన్నకు మరోసారి అధికారం ఇవ్వాలని ప్రజలను కోరారు. శిబిరంలో ఏలూరు నగర అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ బాపిరాజు, హెల్త్ ఆఫీసర్ మాలతి, వైద్య బృందం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.



వృద్ధురాలికి మందులు అందజేసిన శ్రీలక్ష్మి

ఆర్‌ఎస్సై కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పోలీస్ శాఖలో రిజర్వ్ పోలీస్ విభాగంలో 33 ఏళ్లపాటు సేవలందించి ఇటీవల మృతి చెందిన ఆర్‌ఎస్సై గెద్దాడ జీవనరావు కుటుంబాన్ని ఎంపీ కోటగిరి శ్రీధర్ మంగళవారం పరామర్శించారు. స్థానిక కండ్రిక గూడెంలోని జీవనరావు నివాసానికెళ్లి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవనరావు భార్య, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. జీవనరావు రిజర్వ్ విభాగంలో విశేష సేవలందించడంతో పాటు పోలీస్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, ఏలూరు జిల్లా అధ్యక్షునిగా పని చేసి పోలీసుల హక్కుల సాధనకు కృషి చేశారని ఎంపీ శ్రీదర్ గుర్తుచేశారు. ఎంపీ శ్రీధర్ వెంట విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు భూపతి పుల్లయ్య, అంబేద్కర్ ఇండియా మిషన్ ఏలూరు జిల్లా కో కన్వీనర్ భూపతి రమేష్ బాబు, పార్టీ నాయకులు మాయ వెంకట సత్యనారాయణ, టంపల పవన్‌కుమార్ ఉన్నారు.



జీవనరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీధర్

నేడు జోగన్నపాలెంలో గడపగడపకు..

దెందులూరు: జోగన్నపాలెం గ్రామంలో బుధవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిట్టా గాంధీ, సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ కోటగిరి శ్రీధర్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

భక్తులకు అన్న ప్రసాద వితరణ

పెదపాడు: ప్రసిద్ధి చెందిన అప్పనవీడులోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం 200మందికి అన్నదానం చేశారు. ఈ అన్న వితరణ కార్యక్రమాన్ని పర్వతనేని పాండురంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ నెర్సు భూషణం దాత పాండురంగారావును సత్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులపై అవగాహన



దివ్యాంగుల హక్కులను వివరిస్తున్న ఫిజియోథెరపిస్ట్ రాంబాబు

ఏలూరు రూరల్: విద్య, ఉద్యోగం, ఆస్తి తదితర అంశాల్లో దివ్యాంగులు ప్రత్యేక హక్కుల కలిగి ఉన్నారని జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఫిజియోథెరపిస్ట్ జి.రాంబాబు అన్నారు. మంగళవారం శనివారపుపేట జెడ్పీ పాఠశాలలో ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కులపై పిల్లలకు అవగాహన కల్పించారు. 2016లో కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల హక్కులు కాపాడేందుకు ప్రత్యేక చట్టం రూపొందించిందన్నారు. దివ్యాంగులు 18 ఏళ్ల వయస్సు వరకు ఉచిత విద్యతో పాటు, పుస్తకాలు, శిక్షణ సామగ్రి పొందవచ్చునని చెప్పారు. ఉన్నత విద్యలో 5 శాతం రిజర్వేషన్ దివ్యాంగుల హక్కు అన్నారు. వీరికి సమ్మిళిత క్రీడా కార్యక్రమాల నిర్వహణ, వినోదపు హక్కులు ఉన్నాయని వివరించారు. దివ్యాంగులను హేళన చేసిన వారిని సైతం చట్ట ప్రకారం శిక్షించవచ్చన్నారు. దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందించడంతో పాటు ఫీజియోథెరపీ, స్పీచ్‌థెరపీ ప్రత్యేక సంస్థల ద్వారా అందుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గారపాటి ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మాలధారులకు భిక్ష

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో అయ్యప్ప స్వామి, వివిధ మాలలు ధరించిన స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్టు అన్నపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అన్నదాన సమాజం అధ్యక్షుడు కొట్టు మధు తెలిపారు. స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దాతల సహకారంతో డిసెంబర్ 23వ తేదీ వరకు భిక్ష కొనసాగుతుందన్నారు. ఈ మేరకు పేరయ్య కోనేరు ప్రాంగణంలో భారీ ఏర్పాట్లు చేశామన్నారు. భిక్ష స్వీకరించేందుకు వచ్చే స్వాముల సౌలభ్యం కోసం నగరంలోని రామకోటి ప్రాంగణంతో పాటు స్థానిక గజ్జలవారి చెరువు చేపల మార్కెట్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, గూడ్స్‌షెడ్ రోడ్డులోని భారత్ పెట్రోల్ బంకు, పవర్‌పేటలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానాల్లో టోకెన్లు పంపిణీ చేయనున్నామని చెప్పారు. నిత్యం 800 నుంచి 1000 మంది వరకు దీక్షాధారులకు భిక్ష ఏర్పాటు చేస్తున్నామని, అయితే భిక్ష స్వీకరించడానికి ఎంతమంది వస్తారనే అంచనా కోసమే టోకెన్ల విధానం ప్రవేశపెట్టామని వివరించారు. టోకెన్లు లేకపోయినా స్వాములకు భిక్ష పంపిణీ చేస్తామని చెప్పారు. మాలధారులు తీసుకొచ్చే టోకెన్లపై వారి పేరు, ఫోన్ నెంబర్ వేసి ఇస్తే ప్రతి రోజూ వాటిని లక్కీ డ్రా తీస్తామని, డ్రాలో గెలుపొందిన స్వాములకు శబరిమల దర్శనానికి రానుపోను రైలు ప్రయాణ ఖర్చులు ఇస్తామని, ప్రయాణ ఖర్చులు అవసరం లేని వారికి ప్రముఖ పుణ్యక్షేత్రం కాశీ నుంచి తెప్పించిన పట్టుపంచె, కండువా బహూకరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని మాలధారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా టోకెన్లు విడుదల చేశారు. సమావేశంలో అన్నదాన సమాజం ప్రతినిధులు సామర్ల కిరణ్‌కుమార్, మద్దుల శ్రీనివాస్ గోపాల్, వీరమాచనేని చందు, చలువాది పవన్, యడవల్లి కోటేశ్వర రావు, బందా సురేష్, గాజర్ల రాము, రెడ్డి శ్రీకాంత్ పాల్గొన్నారు.



భిక్ష టోకెన్లు విడుదల చేస్తున్న అన్నదాన సమాజం ప్రతినిధులు

గాంధీనగర్ స్కూల్‌కు వివిధ వస్తువుల అందజేత



యోగా మ్యాట్‌లు అందిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక 12 పంపుల సెంటర్‌లోని గాంధీ నగర్ నగరపాలక ఉన్నత పాఠశాలకు కాశీపట్నపు ఫౌండేషన్ ప్రతినిధులు వివిధ వస్తువులను పంపిణీ చేశారు. విద్యార్థుల సౌకర్యం కోసం వైర్‌లెస్ మైక్రోఫోన్ సిస్టమ్, స్పీకర్ సిస్టమ్, యాంప్లిఫయర్, 50 యోగా మ్యాట్‌లు, 25 లెజిమ్స్, 50 జతల కోలాటం స్టిక్స్, 50 డంబెల్స్, 20 నీల్ కమల్ కుర్చీలు పాఠశాల ప్రధానోపాధ్యాయునికి అందించారు. ఫౌండేషన్ ఫౌండర్ ట్రస్టీ కాశీపట్నపు ఇందు శేఖరరావు ఆర్గనైజర్ శంకర వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.